క్లుప్తంగా

నేడు యోగాంధ్ర

బి.కొత్తకోట : హార్సిలీహిల్స్‌పై గురువారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణకు బుధవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. కమిషనర్ జీవీ పల్లవి, తహసీల్దార్ బావాజాన్, ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈవో రెడ్డిశేఖర్, మండల అధికారులు సబ్‌కలెక్టర్ సూచనల మేరకు యోగాంధ్ర నిర్వహించే ప్రదేశాల్లో వెయ్యి మంది ఒకేసారి ఆసనాలు వేసేలా చర్యలు తీసుకున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి ఏడు గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు యోగా కార్యక్రమం నిర్వహిస్తారు.

ఘనంగా గంగజాతర



అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నక్కలదిన్నెలో బుధవారం గంగజాతర ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు దీలు, బోనాలు సమర్పించారు. జాతర పురస్కరించుకుని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ దర్శించుకున్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ముందు తండా ప్రజల ఆరాధ్యదైవం సేవాలాల్ విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అమరేంద్రనాయక్, మంజుల, హరీష్, స్వామినాయక్, కాలేషా, రాఘవ, మహేష్, జబివుల్లా, చరణ్, శ్రీకాంత్, చిన్నా, మహేష్, అబ్దుల్లా, సాదిక్, యాసిన్ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లకు ఈనెల 30వతేదీ వరకు గడువు పొడిగించినట్లు బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. అడ్మిషన్ల గడువు తేదీని పొడిగిస్తూ ఇంటర్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె కొత్తపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, నాయకులు యల్లారెడ్డి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. బుధవారం నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు రెడ్డిబాషా, సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. దాతలు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడానికి తమవంతు సాయమందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, ప్రధానోపాధ్యాయులు బి.చంద్రశేఖర్, సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు బేబిప్రసన్నలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్ మహేశ్వరి పాల్గొన్నారు.

కుమ్మరవారిపల్లిలో చోరీ

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రానికి సమీపంలోని కుమ్మరవారిపల్లిలో జ్యోతినగరం రమేష్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధిత కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదు, 16 గ్రాముల బంగారు నగలు, 100 గ్రాముల వెండి పట్టీలు అపహరించారని ఏఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: జూదం ఆడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లె వద్ద జూదం జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామని వారి వద్ద నుంచి రూ. 11,850 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : అప్పు తీసుకున్న వ్యక్తులు చెల్లించకపోగా, గొడవకు దిగడంతో మనస్థాపం చెందిన మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన రమేష్ భార్య రజనీ (33) అదే ప్రాంతానికి చెందిన గీత, మమతలకు వ్యక్తిగతంగా రూ.7లక్షలు అప్పు ఇచ్చింది. అప్పు చెల్లించమని పదే పదే అడుగుతున్నా వారు చెల్లించకపోగా, గొడవకు దిగడంతో మనస్థాపం చెందిన రజనీ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మారాం.. మారిపిద్దామిలా

- హాలిడే మూడ్ నుంచి బయటకు తేవాలి
- బడికి చిన్నారులను సన్నద్ధం చేయండిలా
- హుషారు నింపి, బడికి పంపాలి



మదనపల్లె సిటీ: బడులు తెరుచుకున్నాయి. పిల్లలు మళ్లీ పుస్తకాల బ్యాగు పట్టాల్సిందే. ఇన్ని రోజులు ఆటపాటలతో సందడి చేసిన పిల్లలు బడికెళ్లబోమని మారాం చేయడం సహజం. కానీ వీరి ఆలోచనలను ఆటల నుంచి బడి బాట వైపు మళ్లించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. పిల్లలూ.. ఇక బారెడు పొద్దెక్కెదాక నిద్రపోవడాలుండవు. అర్ధరాత్రి దాకా సెల్‌ఫోన్లు, కార్టూన్, పోగో, టీవీలు చూడటం ఉండదు. ఒక్కసారిగా టైంటేబుల్ మారిపోతుంది. మరి చిన్నారులు వెంటనే ఈ మార్పులకు సై అనగలరా? సెలవుల్లో మూలపడేసిన క్రమశిక్షణ అర్జంటుగా అలవరుచుకోగలరా? కొంత ఇబ్బందే. చిన్నారుల ఈ మానసికస్థితిని తల్లిదండ్రులు, ఆపైన ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలి. ఈ మేరకు వారిని పాఠశాలకు సన్నద్ధం చేయాలి.

బాధించొద్దు

శని, ఆదివారాల్లో సెలవులను ఎంజాయ్ చేసిన ఉద్యోగులు సోమవారం ఆఫీసుకు వెళ్లేందుకు కొంత ఇబ్బందులు పడతారు. వేసవి సెలవుల తర్వాత పిల్లల పరిస్థితి ఇంతకంటే బాధకరంగా ఉంటుంది. స్కూల్‌కు వెళ్లేందుకు త్వరగా రెడీ అవ్వరు, కావాలని ఆలస్యం, చేసి ఇంట్లోనే ఉండిపోవాలని చూస్తారు. వీరిని తల్లిదండ్రులు కొట్టడం లాంటివి చేస్తుంటారు. కానీ సున్నితంగా చెప్పేనే ఫలితం ఉంటుంది. బడి పునః ప్రారంభంలో పిల్లలు నిరాశతో కన్పిస్తారు. హోమ్‌వర్క్ చేయకపోవడంతో డల్‌గా ఉన్నాడా.. లేక ఇంకేదైనా ఆశిస్తున్నాడా.. అనేది తెలుసుకోవాలి. అప్పుడే మైండ్ సెట్ మార్చవచ్చు. ముందుగా వారి లక్ష్యం గురించి సావధానంగా వివరించండి. చదువుకంటేనే అవి నెరవేరుతాయని మనసుకు హత్తుకునేలా చెప్పండి.

భయాన్ని తొలగించాలి

వేసవి సెలవుల్లో ఇష్టమైన ఆటపాటల్లో నిమగ్నమైన పిల్లలు స్కూల్‌కు వెళ్లే ఇలాంటి వాతావరణం కోల్పోతామని భయపడతారు. అందుకే మారాం చేస్తుంటారు. కానీ చదువుతో పాటు ఇష్టమైన ఆటలు సైతం ఆడుకోవచ్చని వారికి నచ్చజెప్పాలి.

కొత్తదనం ఉండాలి

తొలిసారి స్కూల్‌కు వెళ్లేవారు ఎంతో ఉత్సాహంగా ఉంటారు. రంగు రంగుల పుస్తకాలు, ఆటలు ఇలా వారు ఎంతో ఊహించుకుంటారు. మారాం చేయరు. అలాంటి వాతావరణం ఏటా పిల్లలకు కన్పించాలి. చాలా మంది తల్లిదండ్రులు తొలిసారి పిల్లలను స్కూల్‌కు చేర్పించినప్పుడు కనబర్చే శ్రద్ధ తర్వాత చూపరు. ఇది సరికాదు. క్రమశిక్షణ విషయంలో తల్లిదండ్రులు ఒకే మాటగా ఉండాలి. చాలా మంది ఒకే మాటగా ఉండాలి. చాలా మంది పిల్లలను అమ్మ నిద్రలేపుతుంటే నాన్న పడుకోనివ్వు అంటుంటారు. ఇలా చేయొద్దు.

పిల్లల అభిప్రాయాలు వ్యతిరేకించొద్దు



పిల్లల అభిప్రాయాలను ఒకేసారి వ్యతిరేకించొద్దు. నెమ్మదిగా వారిని మళ్లించాలి. వేసవి సెలవుల్లో స్వేచ్ఛగా ఉంటారు. క్రమంగా వారిని స్కూల్ వాతావరణానికి మార్చాలి. ఆటల నుంచి పిల్లలను బయటకు తీసుకురావాలి. పిల్లలను బెదిరంచవద్దు. చనువుగా మెలగాలి.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

ఆసక్తి కలిగించేలా మాట్లాడాలి



విద్యార్థులు బడికి వెళ్లడానికి భయపడుతుంటారు. వారిలో ఆసక్తి కలిగేలా పాఠశాల గురించి, పుస్తకాలు, స్నేహితుల గురించి తల్లిదండ్రులు మాట్లాడాలి. వారిలో బెరుకు పోగొట్టాలి. బడికెళ్లిన వెంటనే పాఠాలు బోధించకుండా మొదట పది రోజుల పాటు ఉపాధ్యాయులతో మమేకం కావాలి.

–జిల్లా లలితమ్మ, బాలల హక్కుల ఐక్యవేదిక అధ్యక్షురాలు

డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మెకు దిగుతాం



దీక్ష చేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

మదనపల్లె: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఈనెల 22 నుంచి సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ.రమణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 15 రోజులుగా దీక్షలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు సంఘీభావంగా బుధవారం ఆయన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై పోరాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి కార్మికునికి సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపజేయాలని కోరారు. టెక్నికల్ కార్మికులకు నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ పీహెచ్ కార్మికులను ఇంజనీరింగ్ విభాగ కార్మికులుగా గుర్తించాలని కోరారు. ఈ సమస్యలను తీర్చడంతోపాటు ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులకు కూడా వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. ఈ దీక్షలో కార్మిక సంఘ జేఏసీ నాయకులు గోపాలకృష్ణ, సజాద్, బాబు, ఎస్‌కే.రెడ్డెప్ప, ఎంఎస్.కన్నయ్య, కుమార్, మహేష్ కార్మికులు పాల్గొన్నారు.

మామిడి రైతులను విస్మరించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి

కలికిరి: మామిడి రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడాది కాలం పాటు మామిడి పంటను కాపాడుకోగా తీరా రైతుకు పంటచేతికందే సమయానికి ధరలు పాతాళానికి చేరడంతో రైతులు అప్పుల పాలయ్యారన్నారు. కనీస మద్దతు ధరతో ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం మామిడి రైతులను పూర్తిగా విస్మరించిందని, సీఎం సొంత జిల్లాలో మామిడి అధిక దిగుబడులున్నా ఆయన దృష్టిసారించక పోవడం దురదృష్టకరమన్నారు. మామిడి రైతులు జైన్ గుజ్జు పరిశ్రమకు ట్రాక్టర్లతో మామిడిని తీసుకెళ్లి మూడు, నాలుగు రోజుల పాటు అక్కడే పడిగాపులు కాసినా ఫ్యాక్టరీ యాజమాన్యంగానీ, ప్రభుత్వం గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేయాలని, లేకుండా రైతులకు మద్దతుగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లారి శ్రీకర్ రెడ్డి, నాయకులు మల్లికార్జున, నరేష్, జగన్నాథ్, బావాజీ, ఖాదర్ బాషా, భానుప్రకాష్ పాల్గొన్నారు.

పద్మనాభయ్య మృతి తీరనిలోటు



పద్మనాభయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామం చీకిరాల బర్నేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సి.పద్మనాభయ్య(35) మృతి పార్టీకి తీరని లోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వ్యక్తిగత కారణాలతో ఈ నెల 8న ఆత్మహత్యకు పాల్పడిన పద్మనాభయ్య తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం స్వగ్రామం చీకిరాల బర్నేపల్లిలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించగా.. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారి స్వగ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, రాము, ప్రసాద్, కిశోర్‌రెడ్డి, వెంకటస్వామి, వెంకటరమణ, క్రిష్టయ్య, మల్లయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

'తోతాపురి' కిలోకు రూ. 4 అదనం



మామిడి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి

పీలేరురూరల్ : తోతపురి మామిడి కిలోకు ప్రభుత్వం అదనంగా నాలుగు రూపాయలు చెల్లిస్తుందని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తలపుల అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మామిడి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దగ్గరోని జ్యూస్ ఫ్యాక్టరీకి గానీ, ఎఫ్‌పీవోకి గానీ, మండికి గానీ తరలిస్తే ప్రభుత్వం కేజీకి సబ్సిడీ రూపంలో రూ. 4 అదనంగా చెల్లిస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రం రైతుసేవా కేంద్రం సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారికి రైతులు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ఇవ్వాలని కోరారు.

రోడ్ల దుస్థితి మారదా!



బి.కొత్తకోట-కర్ణాటక సరిహద్దు రహదారిపై ఏర్పడిన గుంతలు

బి.కొత్తకోట: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది కూటమి ప్రభుత్వ ఏడాది పాలన. రోడ్లపై గుంతలు ఏర్పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వ పెద్దలు గంభీరమైన ప్రకటలు ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం శూన్యం. బి.కొత్తకోట-కర్ణాటక సరిహద్దు రహదారిపై కంబాలపల్లె ఏటీ వద్ద రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు కూటమి ప్రభుత్వ తీరుకు అద్దం పడుతోంది. ఏడాది పాలనలో రోడ్ల దుస్థితి నేటికి మార లేదు. దీంతో గుంతలతో రహదారి దారుణంగా మారడంతో ప్రయాణికులు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్లపై ప్రతి గంతనూ పూడ్చుతామని ప్రకటించిన ప్రభుత్వం.. ఈ గుంతలను పూడ్చలేకపోయింది. రోడ్లు భవనాల శాఖ అధికారులకు కానీ ప్రజాప్రతినిధులకు కానీ రోడ్ల దుస్థితి పట్టడం లేదు. ఇక్కడి ఏటిపై బ్రిడ్జి నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం పనులు చేపట్టకుండా వదిలేసింది.

పాఠశాల అభివృద్ధికి కృషి

కేవీపల్లె : పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. శీనునాయక్ తెలిపారు. కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఎం. శీనునాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న రెడ్డిప్రదీప్ బదిలీపై రొంపిచెర్లకు వెళ్లారు. బి.కొత్తకోటలో పని చేస్తున్న శీనునాయక్ బదిలీపై కేవీపల్లెకు వచ్చారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తంబళ్లపల్లె: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పీఎం సురక్షమాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తేజస్వి మాట్లాడుతూ గర్భిణులు తప్పకుండా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన గుడ్లు, చేపలు, ఆకుకూరలు, కూరగాయలు తినాలన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సు గ్లోరీ పాల్గొన్నారు.

మెలకువలతో మేలైన దిగుబడులు



ఏఓ స్రవంతి

ములకలచెరువు: రైతులు పంటల సాగులో సాంకేతిక పరమైన మెలకువలు తెలుసుకుని తద్వారా మేలైన దిగుబడులు సాధించాలని ఏఓ స్రవంతి తెలిపారు. ములకలచెరువు ఏఓగా స్రవంతి బుధవారం స్రవంతి బాధ్యతలు స్వీకరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

జూన్ 30లోపు ఈకేవైసీ పూర్తిచేయాలి

మదనపల్లె రూరల్ : రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఈకేవైసీ ప్రక్రియను జూన్ 30 తేదీలోగా రేషన్‌కార్డులోని లబ్ధిదారులందరితో పూర్తిచేయాలని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సివిల్ సప్లయిస్ డీటీ ఎస్.ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వృద్ధులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దకే రేషన్ సరుకులు అందజేయాలని ఆదేశించారు.

సౌర విద్యుత్‌తో ఎంతో మేలు



మాట్లాడుతున్న డీఈఈ చంద్రశేఖర్ రెడ్డి

పెద్దతిప్పసముద్రం: సౌర విద్యుత్ వినియోగంతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని డిస్కం ఏడీ గోవిందరెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సోలార్ ఘర్‌లో భాగంగా సోలార్ పలకల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయనతో పాటు ఏఈ గిరి, సిబ్బంది కలసి రైతులు, ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వాడకం ద్వారా విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గుతాయన్నారు. సోలార్ ఏర్పాటుకు ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు సబ్సిడీ అందిస్తుందని గృహ వినియోగదారులకు మాత్రమే అందిస్తున్న ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఎం సూర్య ఘర్‌కు రాయితీలు

బి.కొత్తకోట: పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై ఏర్పాటు చేసుకునే సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ములకలచెరువు డిస్కం ఏడీఈ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఓ కల్యాణమండపంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజలు ఇళ్లపై ఏర్పాటు చేసుకునే సోలార్ ప్లాంట్లకు ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందని, ఇందులో బీసీలకు అదనంగా రూ.20 వేలు ఇస్తుందని చెప్పారు. వీటిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంతంగా తయారుచేసుకునే విద్యుత్‌ను వారే వినియోగించుకోవచ్చని, విద్యుత్ బిల్లుల భారం ఉండదన్నారు. కార్యక్రమంలో ఏఈ గిరిధర్, స్థానికులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో పీలేరు డీఈఈ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం కలికిరిలో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు లేకుండా చేసుకోవచ్చన్నారు. సోలార్ ప్లాంట్లకు ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందని తెలిపారు. లబ్ధిదారుకు మిగులు విద్యుత్‌ను ప్రభుత్వం రూ.2.09 పైలకు కొనుగోలు చేస్తుందన్నారు. అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ శివయ్య, ఏఈ ముజీబుర్ రెహ్మాన్, డిప్యూటీ ఎంపీడీఓ మహమ్మద్ రియాజ్, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రాలకు 'ఉపాధి'



ఎక్స్‌కవేటర్‌తో ఉపాధి హామీ పనులు చేస్తున్న దృశ్యం

కలికిరి: స్థానికంగా ఉన్న కూలీలకు ఉపాధి కల్పించడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ముఖ్య ఉద్దేశం. ఎక్కడా యంత్రాలతో పనులు చేయకూడదని, యంత్రాలతో పనులు చేస్తే చర్యలు తప్పవని ఉన్నతాధికారులు చెబుతున్నా అవేమీ పట్టనట్లు మండలంలోని పారపట్ల గ్రామంలో బహిరంగంగానే ఎక్స్‌కవేటర్‌తో చేపల చెరువు పనులు చేస్తున్న వీడియో, ఫొటోలు హల్ చల్ చేస్తున్నాయి. అందులోనూ ఫీల్డ్ అసిస్టెంటే దగ్గరుండి పనులు చేయిస్తుండటం గమనార్హం. ఇది గమనించిన స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పారపట్లకు సమీపం బ్రాహ్మణ చెరువులో చేపలగుంత ఏర్పాటుకు వర్క్ ఐడీ నెం.3178849 మేరకు రూ.4,82,547 అంచనా వ్యయంతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. చేపల చెరువు ఏర్పాటు పనులు కూలీలతో చేపట్టాల్సి ఉన్నా ఏ మాత్రం కూలీలు లేకుండా ఫీల్డ్ అసిస్టెంటే దగ్గరుండి ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్నాడు. దీంతో స్థానికులు జరుగుతున్న అక్రమాలపై డ్వామా పీడీ, ఏపీడీలకు ఫిర్యాదు చేశారు. వర్క్ ఐడీ నెం.3178849 చేపల చెరువు పనికి సంబంధించి ఇప్పటికే 953 మంది కూలీలు పని చేసినట్లు వారికి రూ.2,72,000 నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి అక్రమాలపై చర్యలు తీసుకుని ఉపాధి పనులు కూలీలతో చేయించి ఉపాధి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌కు విద్యుత్ పునరుద్ధరణ



ఏడీ కార్యాలయంలో బిషప్ ఐజాక్ వరప్రసాద్‌తో ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు

మదనపల్లె రూరల్ : ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ సంబంధించిన విద్యుత్ బిల్లుల బకాయిలో రూ.20లక్షలు చెల్లించినందున బుధవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌కు సంబంధించి విద్యుత్ బిల్లుల బకాయి రూ.90లక్షలు ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. అయితే ఈ విషయాన్ని రాయలసీమ డయాసిస్ బిషప్.రెవరెండ్.ఐజాక్.వరప్రసాద్ దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన ఆయన రూ.20లక్షలు విద్యుత్ బకాయి చెల్లించారన్నారు. దీంతో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌కు విద్యుత్ సరఫరాను యథావిధిగా పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రవి, డాక్టర్. లారెన్స్, ఆసీస్‌మోసెస్, న్యాషీ, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె రూరల్ : ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని ఎస్టేట్ సమీపంలోని పద్మావతి కల్యాణమండపం సమీపంలో నివసిస్తున్న అన్సర్ బాషా కుమారుడు రఫీ(35) స్థానికంగా రోడ్డుపై నడిచి వస్తుండగా, ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు.

గుర్రంకొండ: ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రం గాయపడిన ఘటన మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ నల్లగుట్టపల్లె వద్ద జరిగింది. మంగళవారం రాత్రి ఎల్లుట్ల గ్రామదేవత శ్రీపాలేటమ్మ జాతర జరిగింది. మండలంలోని సంగసముద్రం పంచాయతీ యల్లంపల్లెకు చెందిన కె. వెంకట రమణారెడ్డి(62) జాతరకు మంగళవారం బైక్‌పై వెళ్లారు. మార్గమధ్యంలో నల్లగుట్టపల్లె నుంచి ఎల్లుట్ల వైపు వేగంగా వెళుతున్న బుల్లెట్ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోవెంకట రమణారెడ్డికి కాలు విరిగిపోగా తలపై బలమైన రక్తగాయాలు అయ్యాయి. గ్రామస్తులు 108కు సమాచారం అందించి బాధితుడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఏఐఎస్ఎఫ్ నాయకులపై దాడి హేయమైన చర్య

మదనపల్లె సిటీ: విజయవాడలోని శ్రీచైతన్య సంస్థల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకులు పాఠ్యపుస్తకాల అక్రమ విక్రయాలకు నిరసన తెలియజేస్తున్న వారిపై పోలీసులు దాడి హేయమైన చర్య అని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ అన్నారు. విద్యా వ్యాపారాన్ని, విద్యార్థులపై మోపుతున్న ఆర్థికభారంపై పోరాటం చేస్తూ నినాదాలు చేస్తున్న వారిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ కాలేజీలకే అండగా నిలుస్తున్నాయన్నారు. ఈ విషయంపై విద్యార్థి సంఘ నాయకులతో కలిసి ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాంధ్రపై సూచనలిస్తున్న అధికారులు

కురబలకోట: యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అంగళ్లులోని విశ్వం విద్యా సంస్థల చైర్మన్ ఎం. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీబీఎస్‌సీ స్కూల్‌లో ప్రపంచ యోగా డేని పురస్కరించుకుని విద్యార్థులు, అధ్యాపకులతో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. చిన్నప్పటి నుంచే మంచి అలవాట్లు అలవర్చుకుంటే భవిష్యత్ జీవితం బాగుంటుందన్నారు. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జ్ఞాపక శక్తి, ఏకాగ్రతకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఇది జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి

పీలేరు : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న యోగాంధ్ర ముగింపు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి కృష్ణకిషోర్ కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 155 కేంద్రాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్, ఎంపీడీవో శివశంకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై సమీక్ష

రామసముద్రం: ఈ నెల 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమంపై బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో నాగరాజు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను దండోరా వేయించి యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం గురించి సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, ఈవోపీఆర్డీ గపూర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే షాజహాన్‌భాషా అన్నారు. బుధవారం పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా అందజేసిన డబ్బును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎ నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ బడులకు పూర్వ వైభవం తెస్తామని పేర్కొన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలను అందరూ రోల్‌మాడల్‌గా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్రహ్మణ్యం, డీవైఈఓ లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.